సాక్షి
కాకినాడ
శనివారం, 14, డిసెంబర్, 2024



కూటమి నేతల బరితెగింపు

ఉచిత ఇసుక మాటున కూటమి నేతలు పేట్రేగిపోతున్నారు. పి.గన్నవరం మండలంలో ఎక్కడా అనుమతులు లేకపోయినా అడ్డగోలుగా ఇసుక కొల్లగొడుతున్నారు.


8 లో



ముందు రెక్కీ.. తర్వాత చోరీ

ఆ దొంగల ముఠా ముందు రెక్కీ నిర్వహిస్తుంది. తర్వాత చోరీలు చేస్తుంది. పలు జిల్లాల్లో 13 చోరీలకు పాల్పడ్డ ఈ ముఠాలోని ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. మరో 6,384 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సీ పోర్టు వద్ద మరో చెక్‌పోస్టు

కాకినాడ సిటీ: రేషన్ బియ్యం రీసైక్లింగ్, అక్రమ ఎగుమతులను నిరోధించేందుకు కాకినాడ సీ పోర్టు వద్ద మరో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు చెక్‌పోస్టులు ఉండగా వీటికి అదనంగా మరొకటి ఏర్పాటు చేశామన్నారు. మూడు షిఫ్టుల్లో 24 గంటలు పని చేసే ఈ చెక్‌పోస్టు వద్ద ప్రతి షిఫ్టులో నలుగురు సిబ్బందిని నియమించామని తెలిపారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల ఆధ్వర్యాన నియమించిన అధికారులు, వివిధ ప్రాంతాల నుంచి పోర్టుకు వచ్చే బాయిల్డ్, ముడి బియ్యాన్ని తనిఖీ చేసి వాహనాలకు గేట్ పాస్ ఇస్తారన్నారు. అనుమానాస్పద బియ్యం గుర్తిస్తే ఆ నమూనాలను సేకరించి జిల్లా పౌర సరఫరాల సంస్థ ల్యాబ్‌కు పంపిస్తారని వివరించారు. పరీక్షలో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ చెక్‌పోస్టును కాకినాడ ఆర్డీఓ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, కాకినాడ పట్టణ, రూరల్ తహసీల్దార్లు వారానికి ఒకసారి తనిఖీ చేసి, నివేదికలు సమర్పిస్తారని కలెక్టర్ తెలిపారు.

అల్లు అర్జున్‌ను అరెస్టు చేస్తే చంద్రబాబును ఏం చేయాలి?

సాక్షి, అమలాపురం: హైదరాబాద్ సంధ్యా థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతికి అల్లు అర్జున్ కారణమని అరెస్ట్ చేస్తే.. గత గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది చావుకు కారణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎందుకు అరెస్టు చేయలేదని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ప్రశ్నించారు. అమలాపురంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. సంధ్యా థియేటర్ దుర్ఘటన చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే దీనికి అల్లు అర్జున్‌ను బాధ్యుడిని చేసి, అరెస్ట్ చేయడం అన్యాయమని అన్నారు.

నాడు చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేయలేదు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో 2015లో జరిగిన గోదావరి పుష్కరాల్లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన తొక్కిసలాటలో 29 మంది చనిపోయారని, నాడు ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. తొక్కిసలాట, మృతి కారణంగా ఇప్పుడు సినీ హీరో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం ఎంత మాత్రం సబబు కాదని స్పష్టం చేశారు. అమలాపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు పుష్కరాల్లో జరిగిన ఘోరానికి చంద్రబాబును అరెస్ట్ చేయనప్పుడు.. ఇప్పుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం తప్పే అవుతుందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇదే విషయాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. ఇలాంటి అరెస్టులను, ఘటనలను ప్రజలు సమర్థించరని హర్షకుమార్ స్పష్టం చేశారు.



కలెక్టరేట్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతుల నిరసన



జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం అందిస్తున్న కన్నబాబు, దాడిశెట్టి రాజా, ముద్రగడ, గీత, ద్వారంపూడి, అనంతబాబు తదితరులు

ఇవీ డిమాండ్లు

- రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలి.
- సూపర్–6 హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి.
- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి.
- ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను తొలగించాలి.
- తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.
- తేమ లెక్కలతో రైతులను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలి.
- ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి.
- రైతులపై అదనపు భారం మోపే చర్యలు **మానుకోవాలి.**

అన్నదాతకు అండగా..

- రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ 'పోరుబాట'
- వైఎస్సార్ సీపీలో ఉరకలెత్తిన ఉత్సాహం
- కేసులకు తగ్గేదే లేదంటూ రోడ్డెక్కిన కేడర్
- కాకినాడలో కదం తొక్కిన రైతన్నలు
- జెడ్పీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ
- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- జేసీకి వినతి పత్రం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారంలోకి వచ్చి, ఆరు నెలలైనా రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై అన్నదాతలు కన్నెర్ర చేశారు. సర్కార్ అనుసరిస్తున్న కప్పదాటు వైఖరి పిడికిలి బిగించారు. వైఎస్సార్ సీపీ జెండాయే అండగా.. ఆ పార్టీ శ్రేణులతో కలసి కాకినాడలో కదం తొక్కారు. రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే వీడాలని, ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

అన్నదాతలను నిట్టనిలువునా ముంచేసిన కూటమి సర్కార్ కళ్లు తెరిపించే లక్ష్యంతో.. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన 'అన్నదాతకు అండగా.. వైఎస్సార్ సీపీ' కార్యక్రమం కాకినాడలో శుక్రవారం విజయవంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా దగా పడ్డ రైతన్నలు పార్టీలకతీతంగా కాకినాడకు పోటెత్తారు. వారికి సంఘీభావంగా జిల్లా నలుమూలల నుంచీ పెద్ద ఎత్తున తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలెక్టరేట్ కిక్కిరిసిపోయింది. ఉదయం 10 గంటలకే జిల్లావ్యాప్తంగా రైతులు, పార్టీ నేతలు భారీ సంఖ్యలో స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్టీ నేతలు వెంట రాగా.. కూటమి సర్కార్ రైతులను దగా చేసిన వైనాన్ని ఎండగడుతూ ప్లకార్డులు, ఫ్లెక్సీలతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసించారు.



జెడ్పీ సెంటర్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సర్కార్ తీరుపై ఆగ్రహం

వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన రైతులు తడిసిన ధాన్యానికి సంబంధించిన వరి కంకులతో జెడ్పీ సెంటర్‌లో నిరసన తెలిపారు. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో తాము నష్టపోతున్నామని, అయినప్పటికీ ప్రభుత్వం కనికరం చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకూ 'అన్నదాతా సుఖీభవ' పేరిట రూ.20 వేలు ఇస్తామన్నారని, ఆరు నెలలైనా రూ.20 కూడా ఇవ్వలేదంటూ నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక వైఎస్సార్ సీపీ శ్రేణులను, సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా పోలీసు కేసుల్లో ఇరికించి, వేధిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ పార్టీ శ్రేణులు ఏమాత్రం వెరవకుండా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి పోటెత్తారు. తద్వారా పోలీసు కేసులకు భయపడేదే లేదని స్పష్టం చేశారు. దీంతో కలెక్టరేట్ జన ప్రభంజనాన్ని తలపించింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. పోలీసు కేసులతో వెనకడుగు వేసేదే లేదనే విషయం భారీగా తరలివచ్చిన శ్రేణులతో స్పష్టమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తన ప్రసంగంలో చెప్పడం కార్యకర్తల్లో మరింత మనోధైర్యాన్ని నింపింది.



ర్యాలీలో వరి కంకులతో రైతుల నిరసన

అడ్డుకున్న పోలీసులు

రైతు సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల హామీలు తక్షణం అమలు చేయాలని కోరుతూ అధికారులకు విజ్ఞాపన అందజేసేందుకు రైతులతో కలసి కలెక్టరేట్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన పార్టీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. వారిని కలెక్టరేట్ ప్రధాన గేటు వద్దనే నిలిపివేశారు. దీనిపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో దిగివచ్చిన పోలీసులు.. చివరకు పరిమిత సంఖ్యలో నేతలను అనుమతించారు. నేతలు, రైతులు వెంట రాగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యాన మాజీ మంత్రులు ముద్రగడ పద్మనాభం, దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నాగులాపల్లి ధనలక్ష్మి, కో ఆర్డినేటర్లు దవులూరి దొరబాబు, ముద్రగడ గిరిబాబు, పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ దశల వారీ ఆందోళనలు చేసేందుకు వెనుకాడేది లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఖరీఫ్‌లో పావలా సాయం అందలేదు



నేను ఏడెకరాలు సాగు చేస్తున్నాను. గత జగన్ ప్రభుత్వంలో అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సొమ్ము వేయడంతో పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా ఉండేది. రైతులకు అండగా ఉంటానని ఎన్నికల్లో చెప్పి, అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఆ విషయాన్ని మరచిపోయింది. పావలా కూడా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. రైతులు అప్పుల పాలవుతున్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు.

– **దువ్వా సత్తిబాబు,**
తమ్మవరం, కాకినాడ రూరల్ మండలం

రైతులకు నిలువునా ముంచేశారు



కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచేసింది. ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులం తుపానుతో కొంత నష్టపోతే.. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పట్టించుకోక మరింత కుదేలయ్యాం. తడిసిన ధాన్యాన్ని తేమ శాతం సాకు చూపించి కొనడం లేదు. 'అన్నదాతా సుఖీభవ' పేరిట ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం లేనే లేదు. ఎన్నికల్లో చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చాక చేస్తున్న పాలనకు సంబంధమే లేకుండా పోయింది.

– **కేతిన అబ్రహం చౌదరి, రైతు,**
ఎన్‌టీ రాజాపురం, గండేపల్లి మండలం

రైతులకు రాయితీలు ఇవ్వలేదు



నాకు సొంతంగా ఎకరం పొలం ఉంది. మరో మూడెకరాలు కౌలుకు చేస్తున్నాను. కూటమి ప్రభుత్వం రైతులకు రాయితీలు ఇస్తామని, ఇవ్వలేదు. పెట్టుబడి సాయం రూ.20 వేలు అందుతుందని ఆశ పడ్డాం. అయినా చిల్లిగవ్వ కూడా అందలేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువ వానలు పడ్డాయి. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంలో తేమ శాతం పేరుతో కోతలు పెట్టడంతో బస్తాకు రూ.1,500కు మించి గిట్టుబాటు కాలేదు. ప్రభుత్వానికి నిరసన తెలియజేసేందుకు వ్యవసాయ పనులు మానుకుని ముందుకు వచ్చాను.

– **బందే వీరభద్రరావు, రైతు,**
వేములవాడ, కరప మండలం

రూ.20 వేల పెట్టుబడి సాయం ఏమైంది



అధికారంలోకి వస్తే రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తానని చంద్రబాబు, పవన్ కల్యాణ్ అంటే చాలా సంతోషించాం. ఆరు నెలలైనా ఇప్పటికీ ఆ ఊసే వినిపించడం లేదు. అసలు ఇది న్యాయమంటారా? మాట ఇచ్చి తప్పుతారా? మాబోటి వాళ్లు ఏమైనా మాట తప్పితే ప్రాణం పోయినంత పనవుతుంది. చివరకు పండించిన పంటకు డబ్బులు ఇవ్వడం కూడా ఆలస్యమవుతోంది. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వానికి తెలియజేయాలనే కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చాం.

– **జ్యోతుల భీముడు,**
మాజీ సొసైటీ అధ్యక్షుడు, గొల్లప్రోలు

హామీలను పెడచెవిన పెడితే ఎలా?



ప్రభుత్వం రైతులకు ఇస్తామని చెప్పిన రూ.20 వేల పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర అందడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి ఎకరాకు రూ.30 వేలు దాటింది. నేను నాలుగెకరాలు సాగు చేస్తున్నా. తుపాను వలన దిగుబడి తగ్గిపోతోంది.

– **పేకేటి చిన అప్పారావు (చంటి), రైతు,**
వాకదారిపేట, తొండంగి మండలం

దాడులపై జర్నలిస్టుల ఆగ్రహం

- వైఎస్సార్ కడప జిల్లాలో 'సాక్షి' మీడియా ప్రతినిధులపై దాడి దారుణం
- జిల్లాలో పాత్రికేయుల ఆందోళనలు
- అధికారులకు వినతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/పిఠాపురం/కిర్లంపూడి: వైఎస్సార్ కడప జిల్లా వేముల మండలంలో సాగునీటి సంఘం ఎన్నికల కవరేజికి వెళ్లిన 'సాక్షి' మీడియా ప్రతినిధులపై అక్కడి అధికార పార్టీ నాయకులు దాడులు చేయడంపై పాత్రికేయులు మండిపడ్డారు. ఈ దాడిని నిరసిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు. మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ దాడిని వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు మండెల శ్రీరామమూర్తి, ఏకే దురాని, అంజిబాబు, సుంకర ప్రసాద్, వెలిది వెంకటరత్నం, అడపా వెంకట్రావు, చిక్కం పళ్ళంరాజు, గోపాలస్వామి తదితరులు ఖండించారు.

పిఠాపురంలో..

పిఠాపురం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలిపారు. అసోసియేషన్ నాయకులు దొరబాబు, ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ, వైఎస్సార్ కడప జిల్లా వేముల మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్లిన 'సాక్షి' మీడియా ప్రతినిధులపై అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడి, గాయపరచడం బాధాకరమని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయమని, జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది పత్రికా స్వేచ్ఛపై, భావ ప్రకటన హక్కుపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఇలాంటి దాడులను ప్రోత్సహించకుండా, పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే కఠినమైన చట్టాలు తీసుకువచ్చి అమలు చేయాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన దుండగులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని, నిందితులు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.



పిఠాపురంలో జర్నలిస్టుల ఆందోళన

కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లోవరాజు, పల్లవరాజు, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, సింహాచలం, రఘు, వల్లీ, చినబాబు, రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో ధర్నా

కడప జిల్లాలో సాక్షి విలేకరిపై దాడిని నిరసిస్తూ కిర్లంపూడిలో ది కిర్లంపూడి ప్రెస్‌క్లబ్ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విలేకర్లపై దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ జె.చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఉడతా అప్పారావు, సీనియర్ జర్నలిస్టు పెంటకోట సాయిబాబు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లే విలేకర్లపై దాడులు చేయడం హేయమని అన్నారు. ఇటువంటి దాడులు మరోసారి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి సుబ్బు, బత్తిన సత్యనారాయణ, గండే నాని, సూరపురెడ్డి పెద్ద, మూరా చంటిబాబు, ఆడారి సూర్య అంజనేయులు, టీవీవీ కృష్ణ, మొల్లేటి సాంబశివ, యనమల జ్యోతిబాబు, నేదూరి చినబాబు, చెప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

కఠిన చర్యలు తీసుకోవాలి



కూటమి నేతలు కడప జిల్లాలో 'సాక్షి' మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడటం అమానుషం. దీనికి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. ఇటీవల జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయి. మీడియాపై దాడి చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఈ దాడులు ఆగుతాయి.

– **వాతాడ నవీన్‌రాజ్,** ముమ్మిడి లక్ష్మణ్,
జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు,
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

'సాక్షి' ప్రతినిధులపై దాడి దారుణం



సాక్షి మీడియా ప్రతినిధులపై కూటమి నేతల దాడి దారుణం. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. ఇటీవల జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయి. నిందితులను వెంటనే అరెస్టు చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– **మంగా వెంకట శివరామకృష్ణ,** డెంకాడ మోహన్,
అధ్యక్ష, కార్యదర్శులు, కాకినాడ జిల్లా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్

దాడి చేసిన వారిని శిక్షించాలి



కడప జిల్లాలో 'సాక్షి' మీడియా ప్రతినిధులపై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఖండిస్తున్నాం. ఇలాంటి దాడుల్ని ఏ పార్టీ ప్రోత్సహించకూడదు. నిందితులు ఎంతటివారైనా కేసులు నమోదు చేసి, శిక్షించాలి. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు వెంటనే కఠినమైన చట్టం తేవాల్సిన ఆవశ్యకత ఉంది. జర్నలిస్టులు ఏ సంస్థలో పని చేసినా వార్తల సేకరణకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారనే విషయాన్ని గుర్తించాలి. ప్రజలు సమాచారాన్ని తెలుసుకునే హక్కును ప్రభుత్వం పరిరక్షించాలి. జర్నలిస్టు వ్యవస్థపై ఇలాగే దాడులు జరిగితే ఈ హక్కు హరించుకుపోయే ప్రమాదముంది. జర్నలిస్టులపై జరిగే దాడుల్ని అన్ని వర్గాలూ ఖండించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.

– **స్వాతిప్రసాద్,** ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ప్రతినిధి

ఉత్తుత్తి హామీలతో కూటమి సర్కార్ దగా

- రైతు సమస్యలపై నిరంతరం పోరుబాట
- 'అన్నదాతకు అండగా.. వైఎస్సార్ సీపీ' ఆందోళనలో కురసాల కన్నబాబు

కాకినాడ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ 'నేతి బీరకాయ'ను తలపిస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ధ్వజమెత్తారు. కాకినాడలో శుక్రవారం నిర్వహించిన 'అన్నదాతకు అండగా.. వైఎస్సార్ సీపీ' కార్యక్రమానికి తరలివచ్చిన రైతులు, పార్టీ శ్రేణులనుద్దేశించి కలెక్టరేట్ వద్ద ఆయన ప్రసంగించారు. కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు గడచినా రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నట్టేట ముంచేసిందని అన్నారు. ఖరీఫ్ దాదాపు పూర్తయ్యి, రబీ ప్రారంభమైనా ఇంత వరకూ పెట్టుబడి సాయం అందించలేదని, ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదని విమర్శించారు. పెట్టుబడి సాయం ఎప్పుడు వస్తుందో కూడా తెలియని దయనీయ స్థితిలో రైతులున్నారని అన్నారు. కనీస మద్దతు ధర దక్కకపోగా ప్రభుత్వమే దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తూ రైతులను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన ఉచిత పంటల బీమాకు కూడా కూటమి ప్రభుత్వం మంగళం పాడేసిందన్నారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు, ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను కట్టడి చేయాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ లెక్కలతో రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని, ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కూటమి సర్కార్‌పై

గోతులు పూడ్చడానికి కూడా శంకుస్థాపనలు చేసి, ఫొటోలకు పోజులిస్తున్న తీరు చూస్తుంటే కూటమి ప్రభుత్వ ప్రచార వ్యామోహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని కన్నబాబు విమర్శించారు. సర్కార్‌పై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, తిరగబడే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. సూపర్–6 హామీలు అమలు చేయకపోగా తప్పుడు కేసులు, కక్ష సాధింపు చర్యలు, ప్రశ్నించే గొంతుకను అణచివేయడం తప్ప ఈ ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్నించారు. సొంతంగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని ఫీట్లు చేసినా వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరని స్పష్టం చేశారు. రైతులకు అన్యాయం జరిగితే ఏమాత్రం ఉపేక్షించబోమని, వారికి అండగా ఉద్యమిస్తామని చెప్పారు. 'ఎన్ని కేసులు పెడతారో పెట్టండి. వెనక్కు తగ్గేదే లేదు' అని అన్నారు. చరిత్రలోనే తొలిసారిగా ఒక ఎస్ఈజెడ్‌లో రైతుల నుంచి తీసుకున్న భూముల్లో 2,180 ఎకరాలు వెనక్కి తిరిగి ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, వాస్తవాలను వక్రీకరించి ఆయనపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు.



ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తున్న కన్నబాబు

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ

సూపర్–6 హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ బాబు ష్యూరిటీ–బాదుడు గ్యారంటీ అన్నట్టుగా తయారైందని కన్నబాబు ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని, అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో పూర్తి చేయని నీరు–చెట్టు పథకానికి బిల్లులు చెల్లింపు మినహా ప్రజాప్రయోజన పథకాలేవీ అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు.

మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వపు అనాలోచిత పనుల వల్ల ఏలేరు రిజర్వాయర్ రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయి దిక్కుతోచని స్థితికి రైతులు చేరుతున్నారని అన్నారు. ప్రభుత్వం ముందుగా చెప్పిన షెడ్యూల్ ప్రకారం రెండో పంటకు నీరందక అల్లాడుతున్నారన్నారు. ఏలేరు రిజర్వాయర్ పరిధిలో అనధికార నిర్మాణాలను, అక్రమ తవ్వకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు దాడిశెట్టి రాజా, ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నాగులాపల్లి ధనలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, పార్టీ కో ఆర్డినేటర్లు దవులూరి దొరబాబు, ముద్రగడ గిరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు యనమల కృష్ణుడు, గుబ్బల తులసి కుమార్, తోట రాంజీ, మురళీకృష్ణంరాజు, అల్లి రాజబాబు, గండేపల్లి బాబీ, వాసిరెడ్డి జమీలు, నాగం గంగబాబు, లాలం బాబ్జీ, ఒమ్మి రఘురామ్, ఆవాల లక్ష్మీనారాయణ, బెజవాడ సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు, సుంకర శివప్రసన్న సాగర్, పాలసపల్లి సరోజ, జమ్ములమడక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

16న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం ఆధ్వర్యాన ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టారస్ కంపెనీలో బీపీఓ, వరుణ్ మోటార్స్‌లో టీమ్ లీడర్, ఎగ్జిక్యూటివ్ సేల్స్, అడ్వైజర్, పెయింటర్ అండ్ డెంటర్, రిలయన్స్ ట్రెండ్స్‌లో రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం, హోండాస్ మోబిస్, పానసోనిక్ అండ్ కేఐఎంఎల్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకూ జీతం, ఆయా ఉద్యోగాలను బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

మీకిన్ని.. మాకిన్ని..

టీడీపీ, జనసేన మధ్య నీటి సంఘాల పంపకం

పిఠాపురం: నీటిసంఘాల ఎన్నికల్లో మీకిన్ని.. మాకిన్ని అంటూ టీడీపీ, జనసేన నేతలు పంచుకుంటున్నారు. నియోజకవర్గంలో 36 నీటి సంఘాలుండగా.. 16 టీడీపీకి 20 జనసేనకు పంచుకున్నారు. పిఠాపురం మండలం, పట్టణంలో 5 టీడీపీకి, 6 జనసేనకు, కొత్తపల్లి మండలంలో ఇరు పార్టీలకు చెరో 3, గొల్లప్రోలు మండలంలో 8 టీడీపీకి, 11 జనసేనకు పంచుకున్నారు. అయితే తమతో సంప్రదించకుండా ఇష్టారాజ్యంగా ఇలా పంచుకోవడమేమిటని రైతులు నిలదీస్తున్నారు. బలం ఉన్న కొందరు పోటీకి దిగనున్నారని తెలుస్తోంది.

క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్


గంధం సునీత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులు పరిష్కరిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం 6, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం అడ్డతీగలలో జాతీయ లోక్ అదాలత్‌లు జరుగుతాయన్నారు.

లారీల యజమానులకు ఫైన్

కొవ్వూరు: ఇసుక సామర్థ్యానికి మించి లోడింగ్ చేసుకుని వెళ్తున్న ఐదు లారీలను టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఏరినమ్మ ర్యాంపు నుంచి నాలుగు, వాడపల్లి ర్యాంపు నుంచి ఒక లారీ అదనపు లోడుతో వెళుతున్నట్లు గుర్తించామని ఏఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. వాడపల్లి ర్యాంపులో పట్టుబడిన లారీలో 11 టన్నులకు అదనంగా ఇసుక ఉన్నట్లు ఏఎస్సై తెలిపారు. ఈ లారీ నుంచి రూ.22,912 అపరాధ రుసుం కింద వసూలు చేశామన్నారు. ఏరినమ్మ ర్యాంపులో దొరికిన నాలుగు లారీలు ఒక్కో లారీ ఆరు టన్నుల పైబడి అదనపు లోడు ఉందన్నారు. వీటి యజమానుల నుంచి అపరాధ రుసుం వసూలు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై జి.పరమేష్ తెలిపారు. మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ


యూత్ ఫెస్ట్ కలర్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చాన్స్‌లర్ తదితరులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వచ్చే ఏడాది జరగనున్న యూత్ ఫెస్ట్ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. జనవరి 9, 10, 11 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను క్యాంపస్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ఎంబీ శ్రీనివాసరావు, ఎస్.రమాశ్రీ, జి.సురేష్, ప్రిన్సిపాల్స్ ఎ.రమేష్, కె.రవిశంకర్, డి.సతీష్ కుమార్, విశాల్ చవాన్, ఎస్‌వీవీఎస్ కుమార్, ఎ.విజయ భార్గవి, డీన్స్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సమయం ఆసన్నం



- పది, ఇంటర్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల
- మార్చి 1 నుంచి ఇంటర్ ఫస్టియర్, 2 నుంచి సెకండియర్
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం

రాయవరం: పబ్లిక్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షల ఫీవర్ ప్రారంభమైంది. బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పదో తరగతి పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేయగా, ఇంటర్ పరీక్షలకు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెకండరీ, మాధ్యమిక విద్యా శాఖలు విద్యార్థులను పరీక్షలకు ప్రిపేర్ చేస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 1 నుంచి ఇంటర్ ఫస్టియర్, 2వ తేదీ నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫస్టియర్ పరీక్షలు మార్చి 19, సెకండియర్ పరీక్షలు 20తో ముగిస్తాయి. ఇదిలా ఉంటే ఫిబ్రవరి 1న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహిస్తారు. ఇంటర్ సెకండియర్ జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకూ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకూ ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో ఉంటాయి. ఉదయం సెషన్ ప్రాక్టికల్స్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం సెషన్ ప్రాక్టికల్స్ 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుపుతారు. సమగ్ర శిక్షా ఒకేషనల్ ట్రేడ్ ఎగ్జామినేషన్స్ ఫిబ్రవరి 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 13 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలు ఆరు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 65, ఒకేషనల్ ఎయిడెడ్ కళాశాలలు 44, హైస్కూల్ ప్లస్ 27 కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న 27,905 మంది ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. ఫస్టియర్ 13,965 మంది, సెకండియర్ 13,940 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 22,814, సెకండియర్‌లో 20,527 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాకినాడ జిల్లాలో 22,560 ఫస్టియర్, 21681 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు.

మార్చి 17 నుంచి 'పది' పరీక్షలు


పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

జిల్లాలో 2025 మార్చి 17 నుంచి మార్చి 31వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. 17న ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభమై 31న ఓఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపరు–2తో పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఏపీ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరగనున్నాయి. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లను మాత్రం వేర్వేరుగా నిర్వహించడం గమనార్హం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో 388 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి 19,454 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పదో తరగతికి సంబంధించి 12,490 మంది బాలికలు, 13,482 మంది బాలురు పరీక్షలకు హాజరు కానున్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 28,898 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.


ఇంటర్ విద్యార్థులకు తరగతులు

అప్రమత్తం చేశాం

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మరింత అప్రమత్తం చేశాం. ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ విద్యార్థులకు అసైన్‌మెంట్స్ ఇస్తున్నాం. తనిఖీలను ముమ్మరం చేస్తున్నాం.

–డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ

'సంకల్పం' పేరుతో..

ఈ ఏడాది ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సంకల్పం పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. తప్పనిసరిగా మంచి ఫలితాలు సాధిస్తాం.

–వనుము సోమశేఖరరావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ

లాభాల ఆశ చూపి రూ.కోటికి టోకరా

రామచంద్రపురం: లాభాల ఆశ చూపి పలువురిని నమ్మించి మోసగించిన వైనంపై రామచంద్రపురం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. స్థానిక ముచ్చుమిల్లి రోడ్డులో సాయిబాబా గుడి వద్ద స్వామికన్ను శశికుమార్ నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో మత్తాల నవీన్‌కుమార్, ముత్తాల సాయిపల్లవి నివసిస్తున్నారు. వీరు శశికుమార్‌తో పరిచయం పెంచుకున్నారు. ఎంఎన్‌కే ట్రేడింగ్ అడ్వయిజరీ కంపెనీలో పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని శశికుమార్‌ను నమ్మించారు. దీంతో అతను రూ.లక్ష పెట్టుబడి పెట్టగా, నెలలోనే రూ. 25 వేల లాభం వచ్చింది. ఇంకా అధిక మొత్తంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అతనికి చెప్పారు. దీంతో శశికుమార్ మిత్రులు, బంధువులకు తెలిపి వారి నుంచి సొమ్ము తీసుకుని కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు. సాయికుమార్‌తో పాటు 14 మంది కంపెనీ ఉద్యోగులుగా చేరి ఇతరులను ప్రోత్సహించారు. శశికుమార్ రూ.కోటి వరకూ ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన 14 మంది పెద్ద మొత్తంలో పెట్టారు. అయితే నవీన్‌కుమార్, సాయిపల్లవిలు ఆరు నెలలుగా వీరికి వేతనాలు, లాభాలు చెల్లించటం లేదు. డబ్బుల గురించి అడగ్గా 10 రోజుల నుంచి వాయిదా వేస్తున్నారు. ఇటీవల ఎటువంటి సమాచారం లేకుండా ఇల్లు వదిలి పోయినట్లు శశికుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను నమ్మించి మోసగించిన నవీన్‌కుమార్, సాయిపల్లవిలపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కూటమి నేతల బరితెగింపు


నదిలో జేసీబీతో ర్యాంపు ఏర్పాటు

- నదికి అడ్డంగా బాట నిర్మాణం
- ఇసుక కొల్లగొట్టేందుకు యత్నం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పి.గన్నవరం: ఉచిత ఇసుక మాటున కూటమి నేతలు పేట్రేగిపోతున్నారు. పి.గన్నవరం మండలంలో ఇసుక తీసేందుకు ఎక్కడా అనుమతులు లేకపోయినా అడ్డగోలుగా ఇసుక కొల్లగొడుతున్నారు. దొరికినంత దోచుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. తాజాగా పి.గన్నవరం పాత అక్విడెక్టు దిగువన డీఎస్ పాలేనికి సమీపంలో కూటమి నేతలు వైనతేయ నదికి అడ్డంగా బాట నిర్మించారు. నదిలో తూరలు ఏర్పాటు చేసి పది రోజుల నుంచి పనులు చేస్తున్నారు. అలాగే ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇసుక తెన్నెల్లో జేసీబీల ద్వారా బాటలు వేశారు. ఈ ఓపెన్ ర్యాంపు ద్వారా భారీ ఎత్తున ఇసుక, తువ్వ మట్టి కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ర్యాంపు నిర్మాణం పూర్తి కావడంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించేందుకు అన్ని సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో సైతం పెద్ద ఎత్తున ఇసుక, తువ్వమట్టి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇసుక దందా సాగిస్తున్న కూటమి నేతలకు నియోజకవర్గ నేత అండదండలు ఉండటంతో రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలపై నోరు మెదపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.


పి.గన్నవరం శివారు డీఎస్ పాలెం వద్ద నదికి అడ్డంగా నిర్మించిన బాట

అక్విడెక్టుకు సమీపంలో..

మరో ప్రాంతంలోని పి.గన్నవరం పాత అక్విడెక్టుకు సమీపంలో అక్రమ ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం అక్విడెక్టుకు 500 మీటర్ల దూరం లోపు ఇసుక తవ్వకాలు సాగించకూడదు. ఈ నిబంధనను విస్మరిస్తూ బోట్స్‌మెన్ సొసైటీ ముసుగులో పడవల ద్వారా అక్రమంగా ఇసుక తీస్తున్నారు. ఈ అనధికార ర్యాంపులో ట్రాక్టర్ ఇసుకకు రూ.1,400 వసూలు చేస్తున్నారు. పడవలపై ఇసుక తెచ్చే కార్మికులకు రూ.900 ఇస్తున్నారు. దీంతో ట్రాక్టర్ ఇసుకకు రూ.500 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు.

ఇసుక తవ్వుతున్న రెండు బోట్ల సీజ్

కొవ్వూరు: గోదావరి నదిలో రోడ్డు కం రైలు వంతెనకు కేవలం మూడు వందల మీటర్ల లోపు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న రెండు బోట్లను సీజ్ చేసినట్లు అఖండ గోదావరి రివర్ బ్యాంక్ (ఏజీఆర్‌బీ) ఏఈ జి.మణికంఠరాజు తెలిపారు. ఈ బోట్లు ఏరినమ్మ ఘాట్‌లో తైలం అశోక్‌కు చెందినవిగా గుర్తించామన్నారు. వీటిని స్థానిక గోష్పాద క్షేత్రంలో బోట్ పాయింట్‌కు తరలించామన్నారు. రోడ్డు కం రైలు వంతెన, ఇతర వంతెనలకు ఐదు వందల మీటర్ల లోపు ఏవిధమైన తవ్వకాలు చేపట్టరాదన్నారు. గతంలో ఔరంగాబాద్, ఏరినమ్మ ర్యాంపులకు చెందిన 12 ఇసుక బోట్లను అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. అధికారులు అప్పట్లో బోట్స్ సీజ్ చేయడంతో పాటు యాజమానులపై కేసు నమోదు చేశారు. అయినప్పటికీ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడకపోవడం విమర్శలకు తావిస్తుంది. రాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జాము వరకు వంతెనలకు సమీపంలోనే ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. అధికారులు మాత్రం అడపాదడపా దాడులు చేసి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తుంది.

తీగ లాగితే డొంక కదిలింది


దొంగ నోట్ల ముఠా గురించి వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు


దొంగ నోట్లను ముద్రించే యంత్ర పరికరాలు

- దొంగ నోట్ల ముఠా అరెస్ట్
- రూ.1.33 లక్షల నకిలీ నోట్ల స్వాధీనం
- 12 యంత్రాలు, పరికరాల సీజ్

అమలాపురం టౌన్: ఓ ఫిర్యాదు ఆధారంగా తీగ లాగితే డొంకే కదలింది.. దొంగ నోట్ల ముద్రణలో ఆరితేరిన ముఠా చివరికి పోలీసులకు చిక్కింది. ముఠాలోని 12 మంది నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్‌తో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. దొంగ నోట్ల ముఠాలో సభ్యులైన రాజోలు మండలం తాటిపాకకు చెందిన పాస్టర్ కొల్లా వీరవెంకట సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన సత్తి వీర రాఘవరెడ్డి, కడియం మండలం వేమగిరికి చెందిన తుంపర దుర్గాప్రసాద్, ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన పొశర్లపూడి వెంకట సత్యనారాయణ, రాయవరం మండలం వెంటూరుకు చెందిన పట్టపగలు మారయ్య, రామచంద్రపురానికి చెందిన ఉత్తరాల హరి అప్పారావు, మాగంటి గోపి, కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన షేక్ మస్తాన్, అదే జిల్లా వీరవల్లికి చెందిన షేక్ హనీఫ్, కపిలేశ్వరపురం మండలం రామాపురానికి చెందిన బొక్కా శ్రీనివాస్, తాళ్లరేవు మండలం బొడ్డువెంకటయ్య పాలేనికి చెందిన మేదా పోసారావు, కాకినాడ జిల్లా పెదపూడికి చెందిన చింతా వీరన్నలను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ముఠా నుంచి రూ.1.33 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లు, ఆ నోట్ల తయారీకి ఉపయోగించే 12 రకాల యంత్రాలు, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా కృష్ణా జిల్లాతో పాటు పలు జిల్లాలో దొంగ నోట్ల మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఎలా బయట పడిందంటే..

గత నెల 30న రాజోలులోని ఓ ఏటీఎంలో తాటిపాకకు చెందిన పాస్టర్ కొల్లా వీరవెంకట సత్యనారాయణ రూ.50 వేలను డిపాజిట్ చేసే ప్రయత్నం చేశాడు. అయితే సత్యనారాయణ డిపాజిట్ చేసిన రూ.వంద, రూ.500 నోట్లు నకిలీవి కావడంతో ఏటీఎం ఆ ప్రాసెస్‌కు అంగీకరించలేదు. దీంతో అనుమానం వచ్చిన రాజోలు యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి.రాజేష్‌కుమార్ దీనిపై లోతుగా దర్యాప్తు చేశారు. సత్యనారాయణ దొంగ నోట్లను ఏటీఎంలో వేయడం, అవి యాక్సప్ట్ కాకపోవడం వెనుక ఓ ముఠా ఉన్నట్లు గుర్తించారు. అనపర్తికి చెందిన వీర రాఘవరెడ్డి, పాస్టర్ సత్యనారాయణ కలసి దొంగ నోట్ల చలామణికి చర్చించుకున్నట్లు గుర్తించారు. వీర రాఘవరెడ్డి మారయ్య, గోపిలను సత్యనారాయణకు పరిచయం చేయడం తెలుసుకున్నారు. వారు ఏజెంట్ల ద్వారా దొంగ నోట్లను ప్రింట్ చేసి సరఫరా చేయిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలోని వీరవల్లి ప్రాంతంలో షేక్ మస్తాన్ ఏఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్ నడుపుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ముఠాలోని 12 మంది ఓ బలమైన నెట్‌వర్క్ ద్వారా దొంగ నోట్లను ముద్రించి చలామణి చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గమనించారు. ఈ కేసు దర్యాప్తులో శ్రమించిన రాజోలు ఎస్సై రాజేష్‌కుమార్‌ను ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి రివార్డు అందించారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, క్రైమ్ సీఐ ప్రశాంత్‌కుమార్‌లను అభినందించారు. క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుళ్లు కె.వెంకటరమణ, ఎం.రమేష్, కానిస్టేబుళ్లు హుస్సేన్, నవీన్, అలీ, పూజలకు కూడా ఎస్పీ రివార్డులు అందించారు.

ముందు రెక్కీ.. తర్వాత చోరీ

- అంతర జిల్లాల దొంగల ముఠా అరెస్ట్
- రూ.24 లక్షల సొత్తు స్వాధీనం

అమలాపురం టౌన్: ఆ దొంగల ముఠా ముందు రెక్కీ నిర్వహిస్తుంది. తర్వాత చోరీలు చేస్తుంది. పలు జిల్లాల్లో 13 చోరీలకు పాల్పడ్డ ఈ ముఠాలోని ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేశారు. ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు చోరీలకు సంబంధించి ఈ ముఠాకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24 లక్షల విలువైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీల వివరాలను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, రావులపాలెం సీఐ విద్యాసాగర్, సీసీఎస్ క్రైమ్ పార్టీ ఇన్‌చార్జి సీఐ డి.ప్రశాంత్‌కుమార్‌తో కలసి వివరించారు. ముఠాలోని నిందితులైన అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన మండేల నాగ భాస్కరరావు, ఐ.పోలవరం మండలం మురమళ్ల శివారు కొత్త కాలనీకి చెందిన బొడ్డు కిషోర్, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం ఎన్టీఆర్ కాలనీకి చెందిన ముత్యాలపల్లి పెద్దిరాజును అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.24 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద శుక్రవారం మధ్యాహ్నం అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 3 చోరీలు, ఆలమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, అంబాజీపేట, అంగర, అమలాపురం పట్టణం, సఖినేటిపల్లి, కొత్తపేట, పి.గన్నవరం పోలీసు స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క చోరీకి పాల్పడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక చోరీ, కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక చోరీకి పాల్పడింది. వీరి నుంచి 311 గ్రాముల బంగారు నగలు, 3.200 కిలోల వెండి వస్తువులు మొత్తం రూ.24 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యుడైన ముత్యాలపల్లి పెద్దిరాజు సస్పెండ్‌కు గురైన వీఆర్వో. ఇతను గత సంవత్సరం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో దొంగ నోట్ల చలామణి కేసులో జైలు శిక్ష కూడా అనుభవించాడు. మరో ముఠా సభ్యుడు మండేల నాగ భాస్కరావు చెడు వ్యసనాల బాట పట్టి చోరీల చేయడానికి అలవాటు పడ్డాడు. ఇతనిపై కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కూడా 40కి పైగా ఇంటి దొంగతనాల కేసులు ఉన్నాయి. ఇంకో నిందితుడు బొడ్డు కిషోర్‌పై అమ్మాయి కిడ్నాప్ కేసులో జైలుకు కూడా వెళ్లాడు. అంతర జిల్లాల దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్ట్ చేసి రూ.24 లక్షల సొత్తును రికవరీ చేసిన ఆత్రేయపురం ఎస్సై రాము, సీసీఎస్ క్రైమ్ పార్టీ ఇన్‌చార్జి సీఐ డి.ప్రశాంత్‌కుమార్‌లను ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.


స్వాధీనం చేసుకున్న రూ.24 లక్షల విలువైన సొత్తును చూపిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ గోవిందరావు

'నన్నయ'లో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు


పందెంలో గెలుపు కోసం పరుగు తీస్తున్న మహిళలు

రాజానగరం: చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. యూనివర్సిటీలో రెండు రోజులపాటు జరిగే ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ (మెన్ అండ్ ఉమెన్) చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి మూడు విభాగాల్లో జరిగే 24 ఈవెంట్స్‌కు అనుబంధ కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారి నుంచి యూనివర్సిటీ టీమ్‌ని ఎంపిక చేయనున్నారు. మొదటి రోజు జరిగిన పోటీల్లో హాఫ్ మారథాన్ పరుగు ఉమెన్ విభాగంలో మొదటి మూడు స్థానాల్లో జి.పావని (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం), ఎస్.సామ్యశిరీష (ఏఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ), బి.నాగలక్ష్మి దుర్గ (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం), మెన్ విభాగంలో బి.సురేష్ (ఎస్‌సీఐఎండీ, తణుకు), ఎ.మోహనకృష్ణప్రసాద్ (డీఎన్ఆర్ కాలేజ్ భీమవరం), పి.సాయిరామ్ (భీమడోలు కాలేజ్) నిలిచారు. అలాగే డిస్కస్ త్రోలో ఉమెన్ కేటగిరీలో సీహెచ్ శోభారాణి (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం), ఎస్.శ్రీలక్ష్మీలావణ్య (నన్నయ యూనివర్సిటీ), కె.శ్రీదేవి (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. ఐదు వేల మీటర్ల వాకింగ్ రేస్‌లో ఉమెన్ విభాగంలో వి.నాగలక్ష్మి, సీహెచ్ ఝాన్సీ దుర్గ, ఎస్.పుష్పలత, 20 వేల మీటర్ల వాకింగ్ రేస్‌లో మెన్ విభాగంలో బి.జీవన్‌కుమార్, యు.భీమయ్య, ఎన్.హేమసాయిలు పతకాలను అందుకున్నారు.